సుప్రసిద్ధ రష్యన్ రచయిత ఫియదోర్ డాస్టావ్‌స్కీ రచించిన నవల

# నేరము–శిక్ష

శ్రీ శ్రీ అనువాదం

జూలై మాసపు తొలి దినాల్లో మరీ ఎండ మంట బెట్టిన ఒకనాటి సాయంకాలం యస్—సాకులో తాను నివసిస్తూన్న సరంబీను విడిచి ఒకానొక యువకుడు కే—వంతెన దిక్కుగా నెమ్మది నడక సాగించాడు డోలాందోళనతో.

ఎలాగయితేనేం, మెట్లు దిగుతూండగా ఇంటి యజమానురాలి కళ్ళ బడకుండా తప్పించుకోగలిగాడతడు. అతని గది ఒక ఉన్నతమైన అయిదంతస్తుల భవనపు పైకప్పుకింద ఉన్నది. దాన్ని గది అనడంకన్న ఒక భోషాణప్పెట్టె అంటేనే బాగుంటుందేమో. యజమానురాలు ఈ గదికీ తిండికీ, ఊడిగానికీ కలిపి డబ్బుతీసుకుంటుంది. ఆవిడ సరాసరి క్రింది అంతస్తులోనే జీవిస్తుంది. అందుచేత వెలుపలికి బయల్దేరినప్పుడల్లా మన యువకుడు యజమానురాలి వంటగది పక్కనుంచి వెళ్ళక తీరదు. ఆ గదితలుపు ఎప్పుడూ తెరుచుకునే ఉంటుంది. తన సరంబీ వదలి బైటికి వెళ్ళిన ప్రతిసారీ మన యువకుడికేదో బెంగా, ఏదో భయం! సిగ్గుతో మొగం తిప్పించుకొని దాటిపోతూ ఉంటాడు. కారణం, అతడు తన ఇంటి యజమానురాలికి నెలల తరబడి బాకీ పడిపోయాడు. అందుకే ఆమె కంట పడడమంటే [illegible]

ఇందుకు కారణం అతడు పిరికివాడని కాదు. నిజానికతడు ధైర్యవంతుడే, అయితే కడచిన కొంతకాలం నుంచీ అతడు చాలా చికాకులలో పడిపోయాడు. మనోవ్యాధి వంటిది పట్టుకుంది. పూర్తిగా తనలోకి తాను ముడుచుకుపోయి అందరికీ దూరంగా ఉంటూ వచ్చాడు. అందుచేత ఒక్క యజమానురాలినే కాదు ఎవరిని కలుసుకోవడానికీ అతనికి మనసొప్పలేదు. దారిద్ర్యంతో అతడు అణగారిపోయాడు. కాని అతని పరిస్థితి ఇటీవల అతన్ని కలవరపరచడం మానివేసింది. నిత్యకృత్యాలలో కూడా అతడు శ్రద్ధతీసుకోవడం లేదు. తీసుకోవాలని అనిపించనే లేదు. యజమానురాలు ఏమిటో చేసిపోతుందనే భయం అతనికి లేదు. కాని మెట్లమీద ఆపడం, అవాకులూ చెవాకులూ ఆడిపోస్తూ ఉంటే తప్పనిసరిగా తాను వినడం, బాకీ చెల్లించమని ఒకటే పోరు, బెదిరింపులు; సణుగుడు, ఆవిడకేం జవాబుచెప్పాలో తెలియక తాను తలకొట్టుకోవడం, సాకులూ, అబద్ధాలూ—ఉహూఁ! అంతకన్న పిల్లిలాగ మెట్లుదిగించి పాకుకుంటూ పోయి ఆమెకు కనబడకుండా తప్పించుకోవడమే నయం—

కాని, ఈ సాయంత్రం మాత్రం. వీధిలో పడ్డ తర్వాత అతని భయాలన్నీ అతనికి గుచ్చుకున్నట్లు తెలుసుకొచ్చాయి.

“అంత పెద్దపని పెట్టుకొని ఈచిన్న చిన్న చిల్లర సంగతులకి జడుస్తున్నాను” అనుకున్నాడతడు చిత్రంగా చిరునవ్వు నవ్వుకుంటూ “హుం! ఔను అన్నీ మనచేతిలో నేఉన్నాయి- పిరికితనంచేతఅన్నిటినీ జారవిడుస్తాం ఇదితథ్యం. మనుష్యుల్ని అన్నిటికన్న ఎక్కువగా ఏదిభయపెడుతుంది చెప్మా? ఒక కొత్త అడుగు వెయ్యడం. ఒక కొత్తమాట ఉచ్చరించడం! అదీఅన్నిటికన్నా ఎక్కువభయపెట్టేది ..ఛా, నేను మరీ జాస్తిగా మాట్లాడుతున్నాను. ఎక్కువగా వాగుతాను కాబట్టే ఏమీ చెయ్యలేక పోతున్నాను. లేక బహుశా, క్రియాశూన్యం కాబట్టే ఎక్కువగా వాగుతున్నానా? ఈక్రితంనెలలోనే నాకు మాటలు జాస్తిఅయినాయి, రోజుల తరబడి కొంపలో కూర్చుని ఆలోచిస్తూండడం వల్ల ..హంతకులగురించి ఆలోచనలు! ఇప్పుడు నేనక్కడ కెందుకు వెళ్ళుతున్నట్టూ? అంతపని నాశక్యమా? నిజంగా నే? అబ్బే. వేళాకోళానికి, నాసరదాకోసం అలాంటి భ్రమకల్పించుకుంటాను. అదో ఆటవస్తువు. ఔను ఈ ఊహ ఒకఆట వస్తువే, బహుశా”

వీధిలో వేడి దుర్భరంగాఉంది. గాలిలేకపోవడం, జనంతొక్కిడి, చెక్కు సున్నం ఘాటు, ఇటుకలు, తనచుట్టూదుమ్మూ, పీటర్స్‌బర్గ్ నగరానికి ప్రత్యేకంగావున్న కంపూ (వేసవికాలంలో నగరాన్ని విడిచి వెళ్ళలేని వారందరికీ ఇది అనుభవమే) ఇవన్నీకలసి ఇదివరకే డస్సి పోయిన యువకుని నరాలమీద ఇంకా బాధాకరంగా పని చేశాయి- ఆప్రాంతంలో మరీఅధికంగా ఉన్న కల్లుదుకాణాలనుంచి వచ్చే దుస్సహ దుర్గంధం. సెలవు రోజులు కాకపోయినా దారి పొడుగునా కనబడే తాగుబోతులూ కలిసి ఈ జుగుప్సాదృశ్యం పూర్తి అయింది. తెలివితేటలుట్టిపడే మన యువకుని ముఖంమీద ఒక క్షణంసేపు చెప్పలేని అసహ్య భావం మెరిసింది. అన్నట్టు ఈయువకుడు చాలా అందమైనవాడు. మామూలు మనుష్యులకన్నా పొడగరి. సన్నంగా ఉంటాడు. సౌష్ఠవమైన శరీర నిర్మాణం. చక్కని నల్లని కళ్ళు. దట్టమైన మంటిరంగు జుత్తూ- అంతట్లోకే అతడు దీర్ఘాలోచనలో పడిపోయాడు- కాదు అతని మనస్సు ఏ ఆలోచనలకీ తావియ్యకుండా శూన్యమయిందనడమే సమంజసం- తనచుట్టూ ఏమున్నదో చూడకుండా, చూడాలనే లక్ష్యంలేకుండా నడుచుకు పోతున్నాడు- అప్పుడప్పుడు తనలో తాను మాట్లాడుకునే అలవాటుచొప్పున ఏదో గొణుక్కుంటాడు- ఈ అలవాటు విషయం ఇప్పుడే అనుకున్నాడు కూడా- అటువంటి సమయాల్లో అతనికి తెలిసి వస్తుంది- తన ఊహలు ఒక్కొక్కప్పుడు గందరగోళంగా ఉంటాయనీ తానుచాలా బలహీనంగా ఉన్నాడనీ! ఎంచేతనంటే రెండు రోజులనుంచీ అతడు భోజనం చెయ్యనే లేదు.

అతడు కట్టుకొన్న బట్టలు అలుగ్గుడ్డల్లాగున్నాయి- ఎప్పుడూ మాసిపోయిన గుడ్డలే కట్టుకోవడానికలవాటు పడ్డ మనిషి కూడా అటువంటి చింపిపాతలు ధరించి వీధిలో కనబడడానికి సిగ్గుపడతాడు- అయితే అతడిప్పుడు నడుస్తున్న నగరభాగంలో మాత్రం ఎవరెలాంటి దుస్తులు కట్టుకున్నా ఏమీ విచిత్రమనిపించదు- దగ్గరలోనే గడ్డిబజారుండడం, చెడ్డపేరున్న ఎన్నోఇళ్ళు, నగరమధ్యంలో క్రిక్కిరిసిన కొంపల్లో రకరకాల కూలిజనం, చిల్లరవర్తకులూ, లెక్కలేని సందులూ ఇటువంటి ఆ ప్రదేశంలో ఎన్నితరహాల మనుష్యులైనా తిరుగుతూఉంటారు- ఎవరెంత చోద్యంగా ఉన్నా ఏమీ ఆశ్చర్యం ఉండదు- కాని యువకుని హృదయంలో ఉక్రోషం, అసహ్యం ఎన్నాళ్ళనుంచో కరడు కట్టి ఉండడం వలన దుస్తులజాగ్రత్త చూచుకొనే ఆ వయస్సులో కూడా తనబట్టలు బాగులేవేఅన్న ధ్యానం కించిత్తుకూడా లేకపోయిందతనికి- అయితే తనకి పరిచయమైన వారిని గాని, ఇంతకు ముందు తనతో చదువుకొన్న విద్యార్థులనుగాని కలుసుకున్నప్పుడు మాత్రం ఇలా కాదు- అసలెప్పుడైనా వాళ్ళని కలుసుకోవడం అంటేనే

అతనికనిష్టం- అలాంటిది, ఒకతాగుబోతు ఏకారణంచేతనో ఎక్కడికో ఒకపెద్దగుర్రం లాగుతున్న బండిలోవేసి లాక్కుపోబడుతూ, హఠాత్తుగా అతన్నిచూసి "ఏయ్ జర్మన్ టోపీ" అని అరుస్తూ ఇతనివేపు వేలుచూపిస్తే యువకుడు ఉన్నపాటుగా ఆగిపోయి వణుకుచేతులతో తనహాట్‌ని అందిపుచ్చుకున్నాడు. అది పొడుగాటి, గుండ్రని హాట్. జిమ్మర్ మన్స్‌లో కొన్నాడు. పూర్తిగా అరిగిపోయి, వయస్సుతో బూజెక్కిపోయింది- బాగా విరిగిపోయి, లొత్తలు పడింది, అంచులుపోయాయి. అతివికారంగా ఒకపక్కకి ఒరిగిపోయింది. అయితే యువకుణ్ణి అలముకొన్నది సిగ్గుకాదు. భయానికి దగ్గరగా ఉండే ఇంకేదో భావం అతణ్ని ఆవరించింది.

"నాకు తెలుసును" అనుకున్నాడు కలవరపాటుతో యువకుడు- "అలాగే అనుకున్నాను. అంతపనీఅయింది. అంతే ఇటువంటి తెలివితక్కువపనులే, ఇంత చిన్నవిషయాలే ఎంతపెద్ద ప్లానులనైనా తగలేస్తాయి ఔను. నాహేట్ మరీపట్టిచ్చేస్తుంది ఈకుళ్ళుగుడ్డలకి సీనోకుళ్ళాయి పెట్టుకోవలసింది. ఏదో ఒకమూకుడు బోర్లించుకోవలసింది- అంతేగాని ఈఅసిరమ్మని కాదు. ఇలాంటి హాట్ ఎవరూ పెట్టుకోరు మైలుదూరంలో కనబడిపోతుంది. అచ్చుగుద్దినట్లు జ్ఞాపకం ఉండిపోతుంది...అదీముఖ్యవిషయం. అందరూజ్ఞాపకం పెట్టుకుంటారు దానితో ఆచోకీదొరికి పోతుంది. ఈవ్యవహారంలో మనం ఎంతగా మందలో కలిసిపోగలిగితే అంతమంచిది. చిన్నచిన్న వివరాలు! చిన్నవిషయాలలోనే జాగ్రత్తపడాలి ఇలాంటి చిల్లరవిషయాలే ఎప్పుడూ నాశనం తెచ్చిపెడతాయి.."

ఇకనెంతో దూరం అతడు వెళ్ళనక్కరలేదు. తాను బసచేసిన ఇంటిగుమ్మం నుంచి ఈగమ్యస్థానానికి ఎన్ని అడుగులో అతనికి బాగా తెలుసును సరిగ్గా ఏడువందల ముప్పై. ఒకసారి కలలలో మైమరచి నప్పుడతడు లెక్కపెట్టాడు. అప్పట్లో ఆకలల నతడంత పట్టింపు చెయ్యలేదు. భయంకరమైనప్పటికీ సాహసికత్వంతో కూడుకున్న ఆస్వప్నాలతో తన్నుతాను వేధించుకునేవాడు. అంతే. ఇప్పుడు నెల్లాళ్ళు గడిచాక, ఇంకోవిధంగా వాటిని పరిగణించడం ప్రారంభించాడు. తన చేతగానితనాన్ని. ఏదోఒక నిశ్చయానికి రాలేకపోవడాన్ని పరిహసించుకుంటూ తరచు తనలో తాను గొణుక్కుంటున్నప్పటికీ తనకు తెలియకుండానే ఈ "భయంకర" స్వప్నం ఎలాగైనా సాధించడానికి ప్రయత్నించదగ్గ ఘన కార్యమని భావించ సాగాడు. నిశ్చయంగా ఇప్పుడు దాని రిహార్సల్ నిమిత్తమే వెళ్ళుతున్నాడు అడుగడుక్కూ అతనిలో ఉద్రేకం తీవ్రతర మవుతోంది.

దిగలాగుతున్న గుండెలతో వొళ్ళంతా కంపరంతో అతడొక పెద్దయింటిలోకి వెళ్ళాడు ఆయింటికి ఒకవైపున కాలువఉంది. ఇంకొకవైపున వీధిఉంది. ఆయిల్లంతా చిన్నచిన్న భాగాల కింద విభజింప బడింది వీటిలో పలురకాల పనిమనుష్యులు బాడుగ కుంటున్నారు. కుట్టుపనివాళ్ళు, కమ్మరులు, వంటవాళ్ళు, గతిలేనిజర్మన్లు, ఏలాగోచేత నైనట్లు బతుకు వెళ్ళబుచ్చుకునే అమ్మాయిలు, చిన్నగుమాస్తాలు మొదలైనవాళ్ళు. ఆయింటి రెండుద్వారాల వద్దనూ రెండు వసారాలలోనూ ఎప్పుడూ ఎవరెవరో వస్తూపోతూ ఉంటారు ఇంటిమొత్తానికి ముగ్గురు నలుగురు కావలివాళ్ళు పనిచేస్తున్నారు. అయితే వాళ్ళలో ఒక్కడూ కనబడనందుకు యువకుడు సంతోషించాడు వెంటనే ఎవ్వరూ చూడకుండా కుడివైపు గుమ్మంతలుపు తోసుకొని జారబడి మెట్లెక్కిపోయాడు. ఆవివెనుక తట్టుమెట్లు ఇరుకుగా చీకటిగా ఉంటాయి. కానిఇదివరకే అతనికి వాటితో పరిచయంఉంది- దారితెలిపినదే ఈపరిసరాలన్నీ అతనికెంతో నచ్చాయి. ఇటువంటి చీకటిలో ఎంత అనుమానపు కళ్ళకైనా భయపడ నక్కరలేదు-

"ఇప్పుడేఇంత భయపడితే, ఒకవేళ నిజంగానే ఆపనిచెయ్యవలసి వచ్చినప్పు డేమవుతుంది?" అని అతడు నాలుగో అంతస్తు చేరుతూండగా తన్నుతాను ప్రశ్నించుకొనక తప్పిందికాదు. అక్కడ

అతనిదారికడ్డుగా కొందరు కూలీలు పక్కగది లోని కుర్చీలూ బల్లలూ మొదలైన సామాన్లు బైటికితీస్తుండడంవల్ల అతని గమనంఆగింది ఆభాగంలో ఒకజర్మన్ గుమాస్తా, సివిల్ సర్వీసులో పనిచేస్తున్నవాడు, సకుటుంబముగా నివసిస్తున్నాడని అతనికి తెలుసును అయితే ఈజర్మన్ ఇప్పుడు మకాం మారుస్తున్నాడన్న మాట కాబట్టి నాలుగోఅంతస్తులో ఒక్క ముసలవ్వ తప్ప ఇకమీద మరెవ్వరూ ఉండరు "ఏమైతేనేం ఇదోమంచి సంగతి" అనుకుంటూ యువకుడు వృద్ధురాలి భాగంముందుగంట మ్రోగించాడు. ఆగంటరాగితో చేసినట్లు కాక తగరంతో చేశారేమో అన్నట్లు వినపడీవినపడని చప్పుడుచేసింది అటువంటి ఇళ్ళలోని చిన్న భాగాలన్నిటిలోనూ అటువంటి చప్పుడు చేసే గంటలే ఉంటాయి- ఆగంట చేసేచప్పుడు ఎప్పుడో మరచిపోయాడు కాబట్టి యువకుడు మళ్ళీ ఇప్పుడు దానివింత చప్పుడువింటే ఏదో జ్ఞాపకంవచ్చి స్ఫుటంగా ఆజ్ఞాపకాన్ని మనస్సుముందుకు తెచ్చుకున్నాడు ..అతడు గతుక్కుమన్నాడు_ ఈసరికి అతని నరాలు చాలా అలసిపోయాయి! కొద్ది సేపటిలో తలుపు సన్నగా తెరుచుకుంది; ముసలిదా తలుపులోంచు అనుమానంగా వచ్చినవాణ్ణి పరకాయించి చూసింది చీకట్లో మెరుస్తూన్న ఆమె కళ్ళు తప్ప మరేమీ కనబడలేదు అయితే మెట్లవద్ద కొంతమంది జనం అలికిడివల్ల ముసలిది ధైర్యం తెచ్చుకొని తలుపు బారగా తెరచింది! మసకగా ఉన్న గుమ్మంలోంచి యువకుడు లోపలికి వెళ్ళాడు- పక్కనున్న చిన్న వంటగదిని వేరు చేస్తూ గుమ్మానికడ్డుగా ఒక బల్లచెక్కల గోడ ఉంది_ ముసిలిది మాట్లాడకుండా యువకుని కెదురుగానిలుచుండి అతని వేపు ప్రశ్నార్థకపుచూపులు చూస్తోంది_ ఆమె పొట్టిగా, వడలిపోయిన అరవై యేళ్ళవృద్ధు- క్రూరచూపులు చూసేకళ్ళు- వాడి కత్తివంటి చిన్నముక్కు. ఏరంగోచెప్పలేని ఆమె జుత్తు కొద్దిగా చింపిరిగావుండి నూనె జిడ్డు ఓడుతోంది- దానిమీద ఆవిడ రుమాలేదీ ధరించలేదు. కోడి కాలువంటి ఆమె పలుచని పొడుగాటి మెడచుట్టూ ఏదోరకం ఫ్లానల్ పీలికను చుట్టుకుంది- అంత వేసవి వేడిలోనూ ఆమె బుజాల మీదుగా ఒక తెగనలిగిన బొచ్చుకుళ్ళాయి వయస్సుతో పచ్చబారి పోయినది, వ్రేలాడుతోంది_ అనుక్షణం ఆముసిలిది దగ్గుతూ మూలుగుతోంది. యువకుడామెవేపు విచిత్రంగా చూశాడో ఏమో ఆమె కళ్ళలోకి మళ్ళీ ఒక అపనమ్మకం ప్రవేశించింది_

"నన్ను రాస్కాల్నికోవ్ అంటారు- విద్యార్థిని, నెల్లాళ్ళకింద ఇక్కడికి వచ్చాను" అని యువకుడు తొందరగా గొణుగుతూ, ఆమెకు ఇంకా ఎక్కువమర్యాద చూపవలసి ఉంటుందని జ్ఞప్తికితెచ్చుకొని నమస్కార ప్రాయంగా సగం వరకు శిరస్సు వంచాడు-

"జ్ఞాపకంవుంది నాయనా, బాగా జ్ఞాపకంవుంది నువ్విక్కడకు రావడం" అని ముసిలిది స్ఫుటంగా పలికింది- ఆమెకళ్ళింకా అతనిని అనుమానపు చూపులు చూస్తూనే ఉన్నాయి_

"ఇదుగో, ఇలాచూడూ ..మళ్ళీ వెనకటి పనిమీదనే వచ్చాను" అన్నాడు యువకుడు ముసలిదాని అనుమానానికి కొంతచిరాకూ, కొంత ఆశ్చర్యమూ పొందుతూ: "బహుశా ఇదిఎప్పుడూ ఇంతే కాబోలు; క్రితంసారి నేను కనిపెట్టలేకపోయానేమో" అనుకున్నాడు కొంచం ఇబ్బందిగా బాధపడుతూ-

ఏదో సందేహిస్తున్నట్లు ముసిలిది ఆగింది— తర్వాత ఒకపక్కకిఅడుగువేసి గదితలుపు వేలితో చూపిస్తూ "లోపలికిరా బాబూ!" అని యువకుణ్ణి తనకంటె ముందుగా లోనికి పోనిచ్చింది-

యువకుడు ప్రవేశించిన గది చాలాచిన్నది. గోడలకి పసుప్పచ్చ బారిన కాగితాలతోను, కిటికీలకి సన్నని మస్లిన్ తెరలతోను జెరానియం పూలతోను అలంకరించబడింది అస్తమించుతూన్న సూర్యుని కిరణాలవల్ల అప్పుడాగది బాగా వెలుగ్గా ఉంది.

"ఓహో? అయితే అప్పుడుకూడా ఇలాగే సూర్యుడు వెలుగుతాడన్న మాట" అని హఠాత్తుగా, కొక తాళీయంగా యువకుని మనస్సులో ఒక ఊహ మెరిసింది. గదినంతా ఒక్కసారి అతడు కలయజూచాడు చూస్తూ వీలయినంత వరకు వస్తువుల యేర్పాటును జ్ఞాపకం పెట్టుకోవాలని ప్రయత్నించాడు కాని ఆగదిలో చెప్పుకోదగ్గ లేవీ లేవు ఉన్న సామానంతా ఒకసోఫా, చిన్నబల్ల, ఒక డ్రెస్సింగ్ టేబిల్, కుర్చీలు, రెండు మూడు పటాలు—అంతే కొయ్యసామాను చాలా పాతది సోఫాకి నాలుగా పెద్దకర్ర వీపుఉంది దానిముందు కోడిగుడ్డు ఆకారపు టేబిల్ ఒకటుంది డ్రెస్సింగ్ టేబిల్ కి ఒక అద్దం అమర్చబడింది ఆఅద్దం రెండు కిటికీలకిమధ్యఉంది గోడలకి పక్కగా కుర్చీలున్నాయి పటాలకి పాతఫ్రేములున్నాయి జర్మన్ అమ్మాయిల బొమ్మలు, వారిచేతులలో పిట్టలున్నాయి ఇవీఆగదిలో సామాను మూలని చిన్న విగ్రహంముందు ఒకదీపం వెలుగుతోంది గది అంతాపరిశుభ్రంగాఉంది నేలా, ఫర్నిచరూ మిలమిలమెరుస్తున్నాయి ప్రతీవస్తువూ ప్రకాశిస్తోంది-

"ఈశుభ్రానికి నిజానికి కారణం" అనుకున్నాడు యువకుడు మొత్తం ఆప్రదేశంలో ఎంతటా ఒక్కధూళిపిసరు కూడాలేదు-

"ఇటువంటి హావాటుముండల ఇళ్ళే ఎంతో ఇమ్ముగా ఉంటాయి" అనిరాస్కాల్నికోవ్ మళ్ళా అనుకున్నాడు పక్కగదిని వేరుచేసే తలుపుమీద వేలాడుతున్న గుడ్డ తెరమీదకొక దొంగచూపు ప్రసరించాడు- ఆగదిలో ముసిలిదాని మంచమూ, డ్రాయరూ ఉన్నాయి- ఇదివరకు అందులోకి యువకుడెప్పుడూ చూడలేదు- మొత్తంమీద ఆ భాగం అంతటికీ ఈరెండుగదులే వున్నాయి-

"ఏంకావాలి నీకు?" అని ముసిల్ది కఠినంగా అడిగింది- వెనకొతలే గదిలోకి వచ్చి ఇదివరకులాగే అతనికి ఎగురుగా నిలిచి అతని మొగాన్ని తిన్నగా చూస్తూ-

"తాకట్టు కోసం ఒకచిన్నవస్తువు తెచ్చాను" అంటూఅతడు జేబులోంచి ఒకపాతకాలపు వెండి వాచీ పైకితీశాడు- దానివెనక భూగోళపు బొమ్మ చెక్కబడి వుంది. గొలుసు ఇనపది-

"క్రిందటిసారి తాకట్టు తాకట్టయి పోయింది- మొన్నటితో నెలరోజులు సరి"

"ఇంకో నెలవడ్డీతెస్తానులే కొంచెంతాళు"

"అదినాయిష్టంలో వుంది నాయనా! నాకు తోచినట్టు చేస్తాను ఇంకోనెల ఆగుతానో వెంటనే నీవస్తువు అమ్మేస్తానో?"

"షాకీ! ఈవాచీమీద ఎంతఇస్తావు- అల్యోనా ఇవానోవ్నా?"

"బాబూ, నువ్వెప్పుడూ ఇలాంటి చిల్లర సరుకులే తెస్తావు- వీటికేంధర వుంటుంది చెప్పు- పోయినసారి నీ వుంగరంమీద రెండు రూబుల్సు ఇచ్చానా? అంగడిలో ఒకటిన్నర రూబుల్సుకి కొత్త ఉంగరమే కొనవచ్చు-"

"వాచీమీద నాలుగు రూబుల్సు ఇప్పించు_ మళ్ళా విడిపించుకుంటాను_ అది మానాన్నగారిది_ త్వరలోనే నాకు కొంతడబ్బు రావాలి"

"ఒకటిన్నర రూబుల్సు_ ముందుగానే వడ్డీ విరకొట్టుకుంటాను- ఆపైని నీయిష్టం"

"ఒకటిన్నరా!" అన్నాడు యువకుడు నిర్ఘాంతపోయి-

"నీయిష్టం"-అని ముసిలిది యువకుడి చేతిలో వాచీ పెట్టింది- యువకుడు దాన్ని తీసుకొని కోపంతో ఇక అక్కడ ఉండకూడదనుకున్నాడు వెంటనే వెళ్ళిపోవలసిందే గాని మళ్ళీ సంబాళించుకున్నాడు_ ఇంకోచోటేదీ లేదని జ్ఞాపకం తెచ్చుకోవడం వల్లనూ అసలిక్కడికి రావడానికి వేరే కారణంఒకటి ఉండడం వల్లనూ-

"అంతే చాలులే! అదే నానెత్తినికొట్టు" అన్నాడతడు కరుకుగా-

తాళపు చెవులకోసం ముసిలిది జేబులు తడువుకుంది తెర తొలగించుకొని అవతలి గదిలోకి మాయమయింది- యువకుడు గదిమధ్యను ఒంట

రిగా నిలబడిపోయి ఏదో ఆలోచించుకుంటూ అనుమానంగా వింటున్నాడు ముసల్ది డ్రాయరు అరలతాళం తెరుస్తూన్న చప్పుళ్లు వినబడింది.

"అన్నిటికన్నా మీది అరఅయితీరాలి" అనుకున్నాడు యువకుడు- "అయితే తాళపు చెవుల్ని కుడిచేతి వైపుజేబులో పెట్టుకుంటుందన్న మాట అన్నీఒకగుత్తిగా ఉక్కుఁంగులో! వాటిలో ఒక తాళంఉంది మిగిలిన వాటన్నిటికన్నా మూడింతలు పెద్దది పెద్దపెద్ద పళ్ళున్న తాళం; అది డ్రాయరుతాళం అయివుండదు అంటే గురేదో బీరువాగాని ఇనప్పెట్టెగాని ఉండితీరాలి ..అదేదో కనిపెట్టవలిసిందే ఇనప్పెట్టెల తాళాలన్నీ ఇలా గేవుంటాయి... కాని యిదంతా ఏం అవమానపు పని!"

వృద్ధురాలు తిరిగివచ్చింది-

"ఇదుగో నాయనా! రూబుల్‌కి నెలకి పది కోపెక్‌లను కొన్నాం కొబట్టి ఒకటిన్నర రూబుల్స్‌కి పదిహేను కోపెక్స్ నెలకిముందే అడ్వాన్సుగా తీసుకుంటున్నాను. కొని కిందటిసారి బదులిచ్చిన రెండు రూబుల్స్‌కి ఇదేలెక్కని నువ్వు ఇరవై కోపెక్స్ బాకీవున్నావు- అంటే మొత్తం ముప్ఫయ్యైదు కోపెక్స్ అన్నమాట; కొబట్టి నీకు నేను వాచీమీద ఒకరూబుల్ పదిహేనుకోపెక్స్ ఇవ్వవలసి ఉంటుందన్నమాట. ఇంద తీసుకో.

"ఏఁవిటీ? ఇంతాచేసి రూబులూ పదిహేను కోపెక్సేనా ఇప్పుడు?"

"అంతే!"

యువకుడు మరేమీ వాదించక డబ్బు తీసుకున్నాడు; ఒకసారి పరకాయించి ముసలిదాన్ని చూశాడు. పోవాలన్న తొందరలో లేడు? ఇంకా ఏదోఅనాలనో, చెయ్యాలనో ఆగినట్టుంది. కొని అదేమిటో అతనికే సరిగా తెలియదు!

"ఒకటి రెండురోజులలో ఇంకో వస్తువుతెస్తానుకుంటాను అల్యోనా ఇవనోవ్నా!—ఖరీదైన వస్తువు—వెండిది—సిగరెట్‌లు వేసుకొనే పెట్టె ఒకస్నేహితుడు దగ్గరనుంచి మనకిరావాలి! వచ్చిన వెంటనే తెస్తాను ." అంటూ కలవరపాటుతో ఆగిపోయాడు.

"సరే తెచ్చినప్పుడు మాట్లాడుదాం ఆ సంగతి"

"పోతున్నాను—[redacted]వ్వా నువ్వెప్పుడూ ఒక్కతెవూ ఈయింట్లో ఉంటావుకాదూ? మీ[redacted]క్కయ్య ఇప్పుడు నీదగ్గర లేదుకాదూ?" అని యువకుడు గుమ్మందాటిపోతూ వీలయినంత యదాలాపంగా ప్రశ్నించాడు.

"ఆవిడవూసు నీకెందుకయ్యా, పెద్దమనిషీ!"

"అబ్బే! మరేం విశేషంలేదు. ఊరికేనే అడిగాను- ఏమడిగినా కస్సుమంటావు... వెళ్లొస్తాను అల్యోనా ఇవనోవ్నా!"

బొత్తిగా కలవరపాటుతో రాస్కోల్నికోవ్ బైటికి వచ్చేశాడు ఈకలవరం మరింత మరింత అతిశయించ సాగింది. మెట్లుదిగుతూ రెండు మూడుసార్లు ఆగిపోయాడు కూడాను, ఏదోఊహ అకస్మాత్తుగా తట్టినట్లు- వీధిలో పడ్డతర్వాత అనుకున్నాడు "భగవంతుడా ఇదంతా ఎంతఅసహ్యం! నిజంగా నేను నిజంగా చెయ్యగలనా?... లేదు ఇదంతా నిరర్థకం, నిరుపయోగం" అని దృఢంగా అనుకున్నాడు. "అయినా ఇంతరాక్షసపుబుద్ధి నాకెలాపుట్టింది? నాగుండెల్లో ఇంత కుళ్ళుందా? ఔనుకుళ్ళే. దుర్భరం, అసహ్యం, అసహ్యం—నెల్లాళ్ళనుంచీ ఇదేమిటి నేనిలాగ..." కొని ఏమాటలు అతని ఆరాటాన్ని స్పష్టపరచలేవు. ముసలిదానింటికి బయల్దేరినప్పుడే తీవ్ర

జుగుప్సాభావం అతని హృదయాన్ని క్రుంగదీసి యమయాతన పెట్టిందో ఆ భావం ఈసరికి మరి స్థాయి హెచ్చి ఏదో నిస్పృష్టాకారం తీసుకుంది దాని కోరలనుంచి తప్పించుకోవడానికేం చెయ్యాలో అతనికేమీ తెలియలేదు పేవ్‌మెంటు మీదుగా అతడు బాగా తాగినవాడులాగ తూలుతూ నడుచుకు పోయాడు. వచ్చేపోయే జనాన్ని లెక్క చెయ్యలేదు. వాళ్ళని తోసుకుంటూ పోయాడు. తర్వాత వీధిలోనికి వచ్చేసరికి మళ్లీ అతనికి స్పృహవచ్చి తేరుకున్నాడు. చుట్టూ కలయచూసి తన సమీపంలోనే ఒక మద్యశాల ఉండడం కనిపెట్టాడు. పేవ్‌మెంటుకి అనుకున్న మెట్లుదిగి అందులోకి పోవాలి అదొక నేల మస్యం. అక్షణంలో ఇద్దరు త్రాగుబోతులు దగ్గరికవచ్చి ఒకడినొకడు తిట్టుకుంటూ ఒకడినొకడు ఆసరాతీసుకుంటూ మెట్లెక్కుతున్నారు ఇక నేమీ ఆలోచించకుండా గాసాక్కల్ని కోవ్ చటూ లున మెట్లు దిగిపోయాడు. ఆక్షణందాక అతఅతడెప్పుడూ సారాకొట్టులో కాలుపెట్టి ఎరుగడు కాని ఇప్పుడు తల తిరిగిపోతున్నట్లనిపించి దాహం విపరీతమయి పోయింది చల్లటి బీరు తాగాలని కోరిక పుట్టింది హఠాత్తుగా తనకు వచ్చిన తనకువచ్చిన నీరసానికి తిండి లేకపోవడమే కారణమనుకున్నాడు ఒకమూల చీకట్లో మురికిలోవున్న ఒకచిన్న జిడ్డుకారుతున్న టేబిలు ముందు కూర్చుని, బీరు తెమ్మని ఆర్డరిచ్చి మొదటి గ్లాసు గుక్కతిప్పకుండా తాగేశాడు వెంటనే అతనికి నెమ్మది కలిగింది. ఆంకోళనపోయి ఆలోచనలు స్పష్టంగా రూపుదాల్చాయి

(యింకావుంది)



రాజకమల్ కళా మందిర్ వారి "దహేజ్" చిత్రంలోని ఒక సన్నివేశం, ఇందులో జయశ్రీ పృథ్వీరాజ్ నటిస్తున్నారు, డైరక్టరు శాంతారాం.